సాక్షి అనకాపల్లి

గురువారం। 30। జనవరి। 2025



హోరాహోరీగా పోరు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ రెండో రోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. 8లో



ఇగ్నో విద్యార్థులకు అవగాహన

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఇగ్నో విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు.



పిల్లల విభాగానికి పరికరాలు

మహారాణిపేట: కేజీహెచ్ పిల్లల విభాగానికి ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ సుమారు రూ.4 లక్షల విలువైన పరికరాలను అందజేసింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సోలం రమేష్, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా కొట్టాన వెంకటరమణలను నియమించారు.

హైకోర్టు ఆదేశాలతో అధికారుల జాయింట్ సర్వే

- పరిహారం కోసం వ్యాజ్యం వేసిన 29 మంది చినకలవలాపల్లి గ్రామస్తులు



చినకలవలాపల్లిలో సర్వే చేస్తున్న వివిధ శాఖల అధికారులు

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి మండలం చినకలవలాపల్లి ప్రాంతంలో నేవీ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో హైకోర్టు ఆదేశాలతో బుధవారం రెవెన్యూ, అటవీశాఖ, పోలీస్‌శాఖ, డీఆర్‌డీవో అధికారులు జాయింట్ సర్వే చేపట్టారు. ఈ ప్రాంతానికి చెందిన 29 మంది తమకు గతంలో అటవీ, ప్రభుత్వ భూముల్లో అధికారులు ఇచ్చిన డీ పట్టాలకు సంబంధించి పరిహారంతో పాటు ఇతర సమస్యలకు సంబంధించి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు నాలుగు శాఖల అధికారులు పిటిషన్‌దారుల సమక్షంలో జాయింట్ సర్వే నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు అనకాపల్లి ఆర్డీవో ఆయిషా, రెవెన్యూ అధికారులు, అటవీశాఖ అధికారులు, రక్షణశాఖ అధికారులు, పోలీసులు చినకలవలాపల్లి గ్రామంలో పర్యటించి పిటిషన్‌దారులను పిలిచి వారి నుంచి వాంగ్మూలం తీసుకొని భూములు సర్వే చేశారు. పిటిషనర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

'తాండవ' లీకేజీల నివారణకు చర్యలు



ప్రాజెక్టు పనుల గురించి డీఈ అనురాధతో చర్చిస్తున్న ఇరిగేషన్ ఈఈ బాలసూర్యం

నాతవరం: తాండవ రిజర్వాయర్ ప్రధాన గేట్ల లీకేజీ ద్వారా వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు చర్యలు చేపడతామని ఇరిగేషన్ ఈఈ వి.బాలసూర్యం చెప్పారు. ఆయన బుధవారం తాండవ రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో ప్రధాన కాల్వల అక్విడెక్టులు, స్లూయిస్‌లను డీఈ అనురాధతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రెండు జిల్లాల పరిధిలో ఉన్న తాండవ కాల్వల అభివృద్ధి కోసం మొదట విడత కింద 18 పనులకు గాను రూ.2 కోట్ల 10 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో తాండవ ప్రధాన గేట్లకు మరమ్మతులు చేస్తామని, ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయన్నారు. అవి కాకుండా తాండవ ప్రధాన కాలువలు, పిల్ల కాల్వలతోపాటు శిథిలమైన అక్విడెక్టులు స్లూయిజ్‌లకు మరమ్మతులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. తాండవ ప్రాజెక్టు జేఈలు శ్యామ్‌కుమార్, రవికుమార్, ప్రేమ్‌కుమార్, దుర్గాప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు నాగబాబు, అప్పారావు, నీటి సంఘాల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ పనులకు ప్రతిపాదనలు

- అధికారులకు అయ్యన్న ఆదేశం



అధికారులతో కలిసి పెద్ద చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: పెద్ద చెరువు ట్యాంక్ బండ్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. బుధవారం తన నివాసంలో ఆర్ అండ్ బీ, పర్యాటక శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం అధికారులతో కలిసి ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయనున్న పెద్ద చెరువును పరిశీలించారు. సిద్ధం చేసిన ప్రతిపాదనలను ఆయా శాఖల హెడ్ ఆఫీసులకు పంపించాలని స్పీకర్ అధికారులకు సూచించారు. పార్కింగ్, టాయిలెట్ల నిర్మాణాలు, విగ్రహాల ఏర్పాటు వంటి అంశాలపై అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ డీఈ విద్యాసాగర్, ఏఈ నారాయణరెడ్డి, టూరిజం శాఖ డీఈ స్వామి, ఈఈ రమణ, ఏఈ సీతారాం పాల్గొన్నారు.

కనబడలేదా..?







యలమంచిలి పట్టణంలోని క్లబ్ రోడ్డులో మూడు దుకాణాలను నిర్మించి, ఇటీవల అట్టహాసంగా ప్రారంభించారు. ఈ దుకాణాల నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవు. ఇక్కడ పాతభవనానికి మరమ్మతులు చేసుకుంటామని మున్సిపాలిటీ అధికారులకు ఒక లేఖ రాసిచ్చి, దర్జాగా కొత్త దుకాణాలను నిర్మించుకున్నారు. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత పాత ప్రహరీని తొలగించడంతో కొత్తగా నిర్మించిన దుకాణాలు బయటకు కనిపించాయి.

పట్టణం నడిబొడ్డులో ఆర్టీసీ కాంప్లెక్స్ మీద కొత్తగా మొదటి అంతస్తు నిర్మాణానికి అనుమతులు తీసుకోలేదు. అంతా కళ్ల ముందే జరుగుతున్నా ఇక్కడ అధికారులు కళ్లకు గంతలు కట్టుకోవడంతో స్లాబ్ పూర్తయింది. దీంతోపాటు కాంప్లెక్సుకు ముందు వైపు కొత్తగా ఒక దుకాణం నిర్మించారు. ఆర్టీసీ అధికారులు దీనికి నెలకు రూ.6 వేలు అద్దె వసూలు చేసుకుంటున్నారు. ఆర్టీసీకి ఆదాయం వస్తున్నా మున్సిపాలిటీ ఆదాయం కోల్పోయింది.

ప్రధాన రహదారి పక్కన ఓ వస్త్ర దుకాణం యజమాని, మరో వ్యక్తి యాతపేట నుంచి ప్రధాన రహదారికి రాకపోకలు సాగించే రహదారికి చెందిన కొంత స్థలాన్ని కలుపుకొని భవన నిర్మాణం చేపడుతున్నట్టు ఆరోపణలున్నాయి. పట్టణానికి చెందిన ఎఫ్‌ఎంబీలో స్పష్టంగా రహదారి కనిపిస్తోంది. అయితే పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు మాత్రం ఈ నిర్మాణాన్ని పకడ్బందీగా పరిశీలించడం లేదన్న ఆరోపణలున్నాయి.

సోమలింగపాలేనికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన వ్యవసాయ భూమిలో కొత్తగా అనుమతి లేని లేఅవుట్ వేస్తున్నారు.

పట్టణంలో కొద్ది నెలల క్రితం అనుమతి లేని లేఅవుట్లను గుర్తించి హెచ్చరిక బోర్డులు పెట్టారు. ప్రస్తుతం అవి మాయమయ్యాయి.

అక్రమ నిర్మాణాలు.. అదనపు అంతస్తులు

యలమంచిలిలో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

యలమంచిలి రూరల్: గతంలో ఎన్నడూ లేనివిధంగా యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో అనధికారిక భవనాలు పెరిగిపోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా పర్యవేక్షణ కరువైంది. పట్టణ ప్రణాళిక విభాగంలో అధికారులు, సిబ్బందితో పాటు క్షేత్రస్థాయిలో అనధికారిక భవనాలను గుర్తించేందుకు వార్డు ప్లానింగ్ కార్యదర్శులు ఉన్నప్పటికీ కొంతమంది నిర్లక్ష్యం, చేతివాటం వల్ల నిబంధనలకు విరుద్ధంగా భవనాలు వెలుస్తున్నాయి. యలమంచిలి మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో సుమారు 50 వేలకు పైగా జనాభా ఉంది. పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది.

భవన, వాణిజ్య, బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా ఇష్టానుసారం నిర్మాణాలు జరుగుతున్నాయి. అధికారులు సంబంధిత యజమానులకు నోటీసులిచ్చి సరిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. క్షేత్రస్థాయిలో ఉండే వార్డు ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షించి అనధికార నిర్మాణాలు జరిగితే పట్టణ ప్రణాళిక విభాగానికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అవేవీ పూర్తిస్థాయిలో జరగడం లేదు.

సామాన్యులపైనే ప్రతాపం

మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం ప్రధాన, అంతర్గత రహదారులు, శివారు ప్రాంతాలు, విలీన పంచాయతీల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా భారీ కట్టడాలు వెలుస్తున్నాయి. అనుమతులు లేకున్నా సెల్లార్లు, అదనంగా అంతస్తులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నారు. వీటితో పట్టణ ప్రణాళిక దెబ్బతింటోంది. తేడా జరిగినప్పుడు సామాన్యులకే తాఖీదులు ఇస్తూ.. రాజకీయ నాయకుల మద్దతు, పలుకుబడి ఉన్నవారి నిర్మాణాలపై తప్పనిసరి అయితేనే నామమాత్రంగా చర్యలు తీసుకుంటూ, కొద్ది కాలం తర్వాత వాటికి రైట్ రైట్ చెబుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. సామాన్యులు కేవలం 10 శాతం నిబంధనలు ఉల్లంఘించినా వారిపై చర్యల పేరుతో హడావుడి చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. అస్మదీయులైతే నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. అంతేగానీ క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను అడ్డుకోవడంలేదు. అధికారుల నిర్వాకంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది.

దాటవేసే ధోరణిలో సమాధానం

భవనాల నిర్మాణ అనుమతి కోసం లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ)ల ద్వారా ప్లాన్‌లు గీయించుకుని సచివాలయం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. భవనం ప్లాన్ అప్రూవల్‌కు సంబంధించి పట్టణ ప్రణాళికా విభాగం ఉద్యోగులు పరిశీలించి నిబంధనల మేరకు ఉంటేనే తమ లాగిన్ నుంచి కమిషనర్ లాగిన్‌కు పంపాలి. కమిషనర్ లాగిన్ ద్వారా మాత్రమే అనుమతులు మంజూరు చేయాల్సి ఉంటుంది.

అనుమతులు పొందిన ప్లాన్ ప్రకారం క్షేత్రస్థాయిలో నిర్మాణాలు జరుగుతున్నాయో.. లేదో నిరంతరం పర్యవేక్షించాలి. నిర్మాణ సమయంలోనే ప్రశ్నిస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. అలా కాకుండా క్షేత్రస్థాయి సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరిస్తూ, నిర్మాణం పూర్తయిన తర్వాత యజమానులను నిబంధనల పేరుతో భయపెడుతూ చేతివాటానికి పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. అదేవిధంగా అనుమతులు లేని నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాల్సి ఉన్నా పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పట్టణ పరిధిలో అక్రమ నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లు జోరుగా వెలుస్తున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



పురపాలక సంఘం పరిధిలో అనుమతులు లేని నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. క్లబ్ రోడ్డులో నిర్మించిన దుకాణాలకు అనుమతులు లేవు. అక్కడ పాత భవనానికి మరమ్మతులు చేసుకుంటామని అడిగి దుకాణాలు నిర్మించారు. ఆర్టీసీ కాంప్లెక్సులో మొదటి అంతస్తు నిర్మాణానికి అనుమతులు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులకు చెప్పాం. పట్టణ పరిధిలో నిర్మాణాలపై నిఘా పెంచుతాం.

–బి.జి.ఎస్.ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్, యలమంచిలి

గ్రామీణ స్థాయి నుంచి పార్టీ బలోపేతం

- కార్యకర్తలకు తగిన గుర్తింపు
- రేపు కశింకోటలో వైఎస్సార్‌సీపీ జిల్లా స్థాయి సమావేశం
- పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ

అనకాపల్లి: జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీని గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని, కార్యకర్తలకు మంచి గుర్తింపు వచ్చే విధంగా కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 31న కశింకోట మండలం తేగాడ గ్రామంలోని సరోజిని విల్లాలో పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీలు బొత్స సత్యనారాయణ, వరుదు కల్యాణి, విశాఖ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలపై సమావేశంలో చర్చిస్తామని చెప్పారు. చిత్తశుద్ధి లేని 8 నెలల సర్కారు పాలనపై ప్రజలు విరక్తి చెందారని, జమిలి ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు.

సూపర్ సిక్స్ గోవిందా

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకూడదని ప్రభుత్వం ఫిక్స్ అయిందని ధర్మశ్రీ ఎద్దేవా చేశారు. అనకాపల్లి నియోజకవర్గంలో వేలాది కోట్లు విలువ చేసే ఖనిజ సంపద ఉందని, ప్రస్తుత ఎంపీ సీఎం రమేష్ వేలాది లారీలతో కొండలను పిండి చేస్తూ, ఖనిజ సంపదను దోచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మార్టూరు, కుంచంగి, కూండ్రం, మామిడిపాలెం, బవులవాడ, జంగాలపాలెం తదితర ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ చేస్తున్నా జిల్లా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు.

ఫార్మా సిటీలోని కాలుష్యంపై దృష్టి పెట్టకుండా పరవాడ మండలంలో సాలాపువానిపాలెం, లేమర్తి, తాడి, లంకెలపాలెం, ఇతర గ్రామాల్లో పేదలకు కేటాయించిన భూములను కబ్జా చేసేందుకు కూటమి నేతలు ఎగబడుతున్నారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దంతులూరి దిలీప్‌కుమార్, బొడ్డేడ ప్రసాద్, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్, పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు మలసాల రమణారావు, కుమార్‌రాజా, ఎంపీపీ గొర్లి సూరిబాబు, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ పాల్గొన్నారు.

నయవంచన.. నమ్మక ద్రోహం

ఇదే చంద్రబాబు నైజం

- సూపర్ సిక్స్ పథకాలకు ఎగనామం పెట్టారు
- అమలు చేయకుంటే ప్రజలతో కలిసి పోరాటం
- మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



దేవరాపల్లి: ప్రజలను నమ్మించి మోసగించడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, నయవంచనలో అతనికి సాటి లేరని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. తారువలో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదని సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేమని చంద్రబాబు పరోక్షంగా చెప్పడంపై ఆయన ఘాటుగా స్పందించారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల ఆశ చూపి, అధికారంలోకి వచ్చాక నమ్మి ఓట్లు వేసిన ప్రజలను వంచించారని నిప్పులు చెరిగారు. చంద్రబాబు సహా పవన్, పురందేశ్వరి తదితర కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలను అందిస్తామని చెప్పి నిలువునా మోసగించారని ధ్వజమెత్తారు. సంపద సృష్టించి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పారని.. మద్యం, మైన్స్, ఇసుక, గ్రావెల్, మట్టి దోపిడీకి అవకాశం కల్పించి సంపదను స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్ ప్రయాణం, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 పథకం ఎక్కడని నిలదీశారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, లేకుంటే నిరుద్యోగ భృతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామన్న హామీకి ఎగనామం పెట్టినట్లేనా అని ప్రశ్నించారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలండర్ల పథకం కొందరికే వర్తించగా, అందులో కొందరికి నగదు జమ కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ చార్జీల భారం మోపడంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. సంక్రాంతికి రోడ్లపై గుంతలన్నీ పూడ్చివేస్తామన్న మాటను నిలబెట్టుకోలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిందని, అధికారం చేపట్టి 8 నెలలు పూర్తయినా ఏ ఒక్కటైనా అమలు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుంటే ప్రజల తరపున పోరాటం సాగించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందని ముత్యాలనాయుడు హెచ్చరించారు.

కోడ్ కూసింది



- ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ
- ఫిబ్రవరి 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు

మహారాణిపేట (విశాఖ): ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ముహూర్తం ఖరారైంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను బుధవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. దీంతో బుధవారం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నికల నియామవళి అమల్లోకి వచ్చింది. ఫిబ్రవరి 3న ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసి, 3 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11న నామినేషన్ల పరిశీలన చేస్తారు. 13వ తేదీ వరకు ఉపసంహరణ గడువు ఉంటుంది, 27న పోలింగ్ పూర్తి చేసి, మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. అభ్యర్థి ఎన్నికను అధికారికంగా ప్రకటించే వరకు ఎన్నికల నియామవళి అమలులో ఉంటుందని కలెక్టర్, ఎన్నికల ప్రధాని అధికారి ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఈ ఎన్నికకు సంబంధించి ఫిబ్రవరి 3న ఆయన అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేస్తారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఆరు జిల్లాల రెవెన్యూ అధికారులు(డీఆర్వో)లు వ్యవహరిస్తారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీకాలం ఈ ఏడాది మార్చి 29తో పూర్తవుతుంది.

21,555 మంది ఓటర్లు

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను గత నెల 30న ప్రకటించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 19,523 మంది ఓటర్లు ఉండేవారు. ప్రస్తుతం 21,555 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 12,948 మంది, మహిళలు 8,607 మంది. శ్రీకాకుళం జిల్లాలో 4,829 మంది, విజయనగరం జిల్లా 4,937 మంది, మన్యం పార్వతీపురం జిల్లాలో 2,262 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,448 మంది, విశాఖ జిల్లాలో 5,277 మంది, అనకాపల్లిలో 2,802 మంది ఓటర్లు ఉన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న సమాచారం మేరకు మొత్తం 123 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతి మండల కేంద్రంలో ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎన్నికల కమిషన్‌కు పంపారు.





పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి తెప్పోత్సవం బుధవారం కనుల పండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామివారు వేణుగోపాల స్వామిగా దర్శనమిచ్చాడు. హంస వాహనంపై నౌకావిహారంలో కనువిందు చేశాడు. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో వరాహ పుష్కరిణి కిటకిటలాడింది. 8లో

క్లుప్తంగా

దేవరాపల్లిలో జాబ్‌మేళా రేపు

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 31న మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో 16 కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్‌.గోవిందరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి జాబ్‌మేళా జరుగుతుందని పేర్కొన్నారు. పదోతరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణలైన 18 సంవత్సరాల నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ యువతీ,యువకులు జాబ్‌మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు ముందుగా naipunyam.ap. gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9014765287, 7981102224 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

టీఐఎస్‌లో తప్పులు సరిచేసుకోవాలి

అనకాపల్లి: ఈ ఏడాది ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతాయని, గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ఉపాధ్యాయులు సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టీఐఎస్)లో తప్పులు లేకుండా చూసుకోవాలని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ వ్యక్తిగత లాగిన్, డీడీవో లాగిన్‌లో తప్పులను ఈనెల 31వ తేదీలోపు సరిచేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పీఏసీఎస్‌లో అవకతవకలపై విచారణ


జానకీరాంపురం పీఏసీఎస్‌లో విచారణ జరుపుతున్న అధికారి

రోలుగుంట: జానకీరాంపురం పీఏసీఎస్‌లో అవకతవకలు జరిగాయని అందిన ఫిర్యాదు మేరకు నర్సీపట్నం అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.శ్రీనివాసరావు బుధవారం విచారణ జరిపారు. 200 మంది బినామీలు, సభ్యుల పేరున రూ.35.49 లక్షల రుణాలు తీసుకున్నారని, దీనిపై విచారణ జరపాలని ఈనెల 27న ఆ శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ ప్రేమ స్వరూపరాణికి బాధితులు కిల్లాడ సాంబమూర్తి, గొల్లు నారాయణరావు, కిల్లాడ అప్పల సీతయ్యనాయుడు, కిల్లాడ వెంకట సూర్యనారాయణ ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు శ్రీనివాసరావు పీఏసీఎస్ కార్యాలయంలో విచారణ జరిపారు. ఫిర్యాదు దారులను, సీనియర్ ఇన్‌స్పెక్టర్ కె.జగన్నాథం, జానకీరాంపురం పీఏసీఎస్ సీఈవో రామకృష్ణను విచారించారు. తమశాఖ మంత్రి ద్వారా ఉద్యోగులు కోర్టులో కేసు వేశారని, దీనిపై స్టే ఉందని, స్టే వెకేట్ కావలసి ఉందని విచారణాధికారి తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో ఉన్నతాధికారులకు నివేదిస్తానని వివరించారు.

హోరాహోరీగా పోరు.. క్రీడాకారుల జోరు

ఉత్సాహంగా పాలిటెక్నిక్ క్రీడాపోటీలు


బంతిని ప్రత్యర్థి కోర్టులోకి స్మాష్ చేస్తున్న ఫార్వార్డ్ జోన్ ఆటగాడు

విశాఖ స్పోర్ట్స్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ రెండో రోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. మూడు రోజులపాటు జరిగే ఈ మీట్‌లో అథ్లెటిక్స్ అంశాలతోపాటు ఆరు క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 13 రీజియన్లకు చెందిన పాలిటెక్నిక్ కళాశాలల ఆటగాళ్లు ఆయా జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ పోటీపడుతున్నారు. రెండో రోజు బాలురు, బాలికలకు జరిగిన వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్ పోటీలు తుది దశకు చేరుకోగా ఇంజోర్ క్రీడలు ముగిశాయి. అథ్లెటిక్స్ ట్రాక్‌లో బాలుర 1,500 మీటర్ల పోటీ ముగియగా, ఫీల్డ్‌లో జావెలిన్, డిస్కస్‌తోపాటు హైజంప్ పోటీలు ముగిశాయి. కాగా.. ఈ ఏడాది నుంచి జరిగే మీట్స్‌లో ఉద్యోగులకు కూడా పోటీలు నిర్వహించేందుకు విద్యాశాఖ కమిషనర్ గణేష్‌కుమార్ నిర్ణయించారని మీట్ కన్వీనర్ నారాయణరావు, కో-కన్వీనర్ జానకిరామయ్య తెలిపారు. ఈసారి మహిళా విభాగంలో ఉద్యోగులకు టీటీ పోటీలు నిర్వహించామని వెల్లడించారు.

వివిధ క్రీడల్లో విజేతలు వీరే..

మహిళల విభాగపు టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో భార్గవి శివప్రభ (శ్రీకాకుళం), యు.దేవకుమారి (కర్నూలు) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. డబుల్స్‌లో ఎం.కీర్తి-హెచ్.ఉషా (శ్రీకాకుళం) జోడీ విజేతగా నిలవగా, టి.అంజనాదేవి- ఎన్.సులక్షణ (గుంటూరు) జోడీ రన్నరప్ సాధించింది.

- బాలికల చదరంగం పోటీల్లో కె.జాహ్నవి శ్రీ (భీమునిపట్నం), బి.రమ్యశ్రీ వైష్ణవి (శ్రీకాకుళం), టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో వై.గాయత్రిదేవి (గుడ్లవల్లేరు), జి.రమ్య (తిరుపతి), బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో కె.ప్రతీ సత్యశివాని (గన్నవరం), ఆర్.సాయి అశ్మిత (నెల్లూరు) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో వి.దీప్య-బి.సుభాషిణి (భీమునిపట్నం) జోడీ, ఎస్.ఓష్మశ్రీ - ఎస్.హర్షిణి (ఏలూరు) జోడీ, టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో ఎస్.ఓష్మశ్రీ- బి.దివ్య (ఏలూరు) జోడీ, వై.గాయత్రిదేవి-టి.ప్రశాంతి జోడీ తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. షాట్‌పుట్‌లో వి.లక్ష్మిసాయి కృష్ణతులసి (తూర్పుగోదావరి), కె.భారతి (గుడ్లవల్లేరు, కృష్ణా), ఎ.రక్షిత (భీమునిపట్నం, విశాఖ), డిస్కస్‌త్రోలో కె.వెంకట మానస (రంగంపేట), వి.లక్ష్మి సాయి కృష్ణ తులసి(పెద్దాపురం, తూర్పుగోదావరి), టీహెచ్‌ఎస్‌ఎస్ లక్ష్మి (ఏలూరు) తొలి మూడు స్థానాల్లో నిలిచారు.


లెగ్‌త్రస్ట్ చేస్తున్న కబడ్డీ డిఫెండర్

- బాలుర చదరంగంలో డి.షణ్ముఖ సత్య ఉదయ్ సాత్విక్ (అమలాపురం), కె.నిఖిలేష్ సాయి (గుడ్లవల్లేరు), టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఎం.యువ సంతోష్ మణి పట్టాభి రామ్ (కాకినాడ), జి.రెడ్డిచరణ్ (తిరుపతి) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. డబుల్స్‌లో ఎ.హేమంత్‌కుమార్ - కె.శుభార్జున్ (పరిటాల) జోడీ, బి.అభిషాయ్- జె.అత్యుత సాయ్ కుమార్ (ఆనందపురం) జోడీ, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఎం.సూర్యకిరణ్ -కె.రిషి జోడీ, ఎన్.జస్వంత్-జి.విజయ్‌లిఖిత్ జోడీ (పొద్దుటూరు) తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. హైజంప్‌లో ఎస్.ఈశ్వర్ వర్ధన్ (ఆనందపురం), కె.ప్రశాంత్‌కుమార్ (పాడేరు), వి.త్రిమూర్తి (కర్నూలు) తొలి మూడు స్థానాల్లో నిలవగా, జావెలిన్‌త్రోలో ఎస్.చరణ్ (ఎటపాక), కె.ప్రణీత్ (విశాఖ), కె.సూర్యతేజ (ఏలూరు) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. 1,500 మీటర్ల పరుగులో వై.మహేష్ (అనంతపురం), టి.నాగశ్రీనివాసులు (కర్నూలు), కె.శేషాద్రి (కర్నూలు) తొలి మూడు స్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.


డబుల్‌బ్లాక్ చేసిన ఆటగాళ్లు

కట్టుకున్నవాడే కాలయముడు

హత్య



భర్తలో చేతిలో హత్యకు గురైన బొడ్డు వరలక్ష్మి, బోరున విలపిస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

- నిద్రిస్తున్న భార్యను కడతేర్చిన తాగుబోతు
- ముషిడిపల్లిలో దారుణ ఘటన

దేవరాపల్లి: కట్టుకున్న భర్తే ఆమె పాలిట కాలయముడిగా మారాడు. నిద్రిస్తున్న భార్యను హతమార్చాడు. మండలంలోని ముషిడిపల్లి చెందిన బొడ్డు నారాయణమూర్తి తన భార్య వరలక్ష్మి (38)ని నైలాన్ తాడుతో ఉరి వేసి అతి కిరాతంగా హత్య చేశాడు. మంగళవారం రాత్రి జరిగిన ఘటన బుధవారం ఉదయం వెలుగు చూసింది. స్థానిక ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు.. మద్యానికి బానిసైన నారాయణమూర్తి తరుచూ భార్య వరలక్ష్మిని వేధిస్తూ చిత్రహింసలకు గురి చేసేవాడు. పెద్దల సమక్షంలో పలుమార్లు అతడిని మందలించినా ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రాలేదు. మంగళవారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భార్య నిద్రించిన కాసేపటి తర్వాత మద్యం మత్తులో ఉన్న నారాయణమూర్తి ఆమె మెడకు నైలాన్ తాడు బిగించి ఉరి వేసి చంపేశాడు. బుధవారం ఉదయం తన భార్య ఎంత పిలిచినా నిద్రలో నుంచి లేవట్లేదంటూ మృతురాలి కుటుంబ సభ్యులకు ఫోన్‌లో తెలియపరిచాడు. వెంటనే బయలుదేరి ముషిడిపల్లికి చేరుకున్న ఆమె బంధువులు విగతజీవిగా పడి ఉన్న వరలక్ష్మిని చూసి బోరున విలపించారు. అక్కడ పరిస్థితిని చూసి అనుమానం వచ్చిన మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన చెల్లిని బావే ఉరి వేసి చంపేశాడంటూ మృతురాలి అన్నయ్య కె.శ్రీరామమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని కె.కోటపాడు సీఐ పి.పైడిపునాయుడు, ఎస్‌ఐ మల్లేశ్వరరావు బుధవారం పరిశీలించారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.


సంఘటన స్థలంలో విచారణ చేపడుతున్న ఎస్‌ఐ మల్లేశ్వరరావు

కుటుంబ సభ్యుల కన్నీరు మున్నీరు

మృతురాలికి ఇంటర్ చదువుతున్న కుమారుడు, 9వ తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. తల్లి మృతదేహం వద్ద వారు గుండెలవిసేలా రోదించిన తీరు పలువుర్ని కంటతడి పెట్టించింది. వరలక్ష్మి మృతి చెందిందన్న వార్త అందుకొని పరుగున వచ్చిన ఆమె కన్నవారు.. హత్యకు గురైందని తెలుసుకొని హతాశులయ్యారు. వారి రోదనలతో గ్రామం విషాదంలో మునిగిపోయింది.

ఆత్మహత్య

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత బలవన్మరణం

కశింకోట: అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని వెదురుపర్తి గ్రామంలో జరిగింది. ఇందుకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు విలేకరులకు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం..పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామానికి చెందిన మిరియాల సుమ(29)కు, మండలంలోని వెదురుపర్తి గ్రామానికి చెందిన పలివేల కృపా సాగర్‌కు 2019లో వివాహం జరిగింది. కొంత కాలం పాటు వీరి కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత నుంచి అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. భర్త, అత్తమామలు, ఆడపడుచులు కలిసి తరచుగా సుమను అదనపు కట్నం కోసం వేధించడమే కాకుండా సూటిపోటి మాటలతో ఆడిపోసుకునేవారు. దీంతో తన పుట్టింటికి వెళ్లి వారం రోజుల క్రితమే వెదురుపర్తిలోని తన భర్త ఇంటికి సుమ వచ్చింది. ఈ నేపథ్యంలో భర్త, అత్త తదితరుల వేధింపులు ఆగకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని గమనించి సుమను కిందకు దింపేసరికి తుది శ్వాస విడిచింది. అత్తింటి ఆరళ్లకు తన కుమార్తె బలైందని తల్లి వెంకయ్యమ్మ ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్‌ఐ లక్ష్మణరావు సందర్శించి విచారణ చేపట్టారు. తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు, వీఆర్‌వో సమక్షంలో శవ పంచనామా నిర్వహించారు. అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి 2, 4 సంవత్సరాల వయస్సు కలిగిన షారో, శివ అనే ఇద్దరు కుమార్తెలున్నారు. నమోదు చేసినట్టు సీఐ స్వామినాయుడు తెలిపారు.


కశింకోట పోలీసు స్టేషన్‌లో విచారణ చేస్తున్న డీఎస్పీ శ్రావణి


ఆత్మహత్యకు పాల్పడిన పలివెల సుమ(ఫైల్)

డీఎస్పీ విచారణ

కశింకోట పోలీసు స్టేషన్‌లో సుమ మృతిపై డీఎస్పీ శ్రావణి సమగ్ర విచారణ చేపట్టారు. భర్త కృపాసాగర్, అత్త పార్వతి, మామ అప్పారావు, ఆడపడుచు మేరీ, బంధువులు, గ్రామస్తులను విచారించారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. తన కుమార్తె సుమ మృతికి కారణమైన అత్తింటి వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సుమ తల్లి మిరియాల వెంకయ్యమ్మ డిమాండ్ చేశారు.

బాలికను వంచించిన భర్త, అత్తలపై పోక్సో కేసు

- వివరాలను వెల్లడించిన పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

పెద్దాపురం: మైనర్ బాలికను మోసం చేసి, ఆమె అనారోగ్య పరిస్థితికి కారణమైన వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం బంగారంపాలెం గ్రామానికి చెందిన ఎరుపల్లి అంజలి(17)కి పెద్దాపురం పట్టణానికి చెందిన ధరణికోట చందుతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారి, వారు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. దీనిపై అనకాపల్లి పీఎస్‌లో ఆరు నెలల క్రితం పెద్దలు ఫిర్యాదు ఇవ్వగా, ఫ్యామిలీ కౌన్సెలింగ్ తర్వాత ఇద్దరి ఇష్ట ప్రకారం అక్కడే కాపురం చేశారు. గతేడాది డిసెంబర్ 20న పెద్దాపురం ఎన్టీఆర్ కాలనీలో అపార్ట్‌మెంట్‌కు మకాం మార్చారు. అనంతరం భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా డిసెంబర్ 28న అస్వస్థతతో ఉన్న అంజలిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఆమె కాకినాడ జీజీహెచ్‌లో ఇచ్చిన వాగ్మూలం ప్రకారం, భర్తతీరుతో మనస్తాపం చెంది చెంది చీమల మందు తీసుకున్నట్టు తెలిపింది. పెద్దాపురం పోలీసులు విచారణచేసి, మేజిస్ట్రేట్ ఎదుట డీడీ చేయించాక, ఆమె కాకినాడ నుంచి బంగారమ్మపాలెం వెళ్లిపోయింది. ఆ సమయంలో తన అత్త వ్యభిచారం చేయాలంటూ అంజలిని ప్రోత్సహించినట్టు పెద్దాపురం పోలీసులకు చెప్పలేదు. ఈ నెల 25న పెద్దాపురం పోలీస్ స్టేషన్‌కు విశాఖపట్నం విమ్స్ ఆస్పత్రి నుంచి ఎరుపల్లి అంజలి తల్లి దుర్గమ్మ ఇచ్చిన వాగ్మూలం మేరకు, అంజలి మాట్లాడలేని స్థితిలో ఉన్నందున, దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బాలిక ఆ స్థితిలో ఉండడానికి కారణమైన చందు, నీలిమపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు.

గీత కులస్తుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం:గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. సర్కిల్ పరిధిలో రోలుగుంట -1, మాకవరపాలెం-1, కోటవురట్ల-1 షాపులను గీత కార్మికుల కులాలకు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. దరఖాస్తుదారులు తప్పని సరిగా ఉప కుల సర్టిఫికేట్ జతపరచాలన్నారు. దరఖాస్తుతో పాటు రూ.2 లక్షలు చలానా రూపంలో చెల్లించాలన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తు సమర్పించాలని, 7వ తేదీన లాటరీ తీస్తామని చెప్పారు.

ఎస్సీ కాలనీలో అర్ధరాత్రి బీభత్సం

- నిందితుల కోసం పోలీసుల గాలింపు


సిబ్బందితో కలిసి ఎస్సీ కాలనీలో పర్యటిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి నర్సీపట్నం ఎస్సీ కాలనీలో ఈ నెల 28 తేదీ అర్ధరాత్రి అదే కాలనీకి చెందిన పాత నేరస్తుడు రౌతు మల్లేష్, అతని ఇద్దరి కుమారులు రౌతు కుమార్ కరుణాకర్, సాయికిరణ్‌లతో పాటు కేత సాయి, కేత తారక్ మరికొంత మంది బీభత్సం సృష్టించారని సీఐ జి.గోవిందరావు తెలిపారు. వీరంతా మద్యం తాగుతూ కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం కళ్లద్దాలను ధ్వంసం చేశారని చెప్పారు. దీనిపై ప్రశ్నించిన స్థానికంగా ఉన్న గారా దుర్గా ప్రసాద్, లోవరాజుతోపాటు మరి కొంత మందిని కత్తులతో బెదిరించి, గొడవకు దిగారని సీఐ తెలిపారు. అదే సమయంలో కాలనీలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి వచ్చిన ఎలక్ట్రికల్ జూనియర్ లైన్‌మేన్, షిఫ్ట్ ఆపరేటర్‌పై తిరగబడి కత్తులతో బెదిరించి గాయపరిచారని తెలిపారు. విషయం తెలుసుకుని సిబ్బందితో అక్కడకు వెళ్లిన తనకు, సిబ్బందికి కత్తులు చూపిస్తూ పరుగులు తీశారని సీఐ తెలిపారు. విగ్రహం విషయంలో నిలదీసిన గారా దుర్గాప్రసాద్ ఇంటికి వెళ్లి మంచంపై ఉన్న సోఫాసెట్‌పై పెట్రోల్ పోసి తగలబెట్టారని చెప్పారు. సమీపంలోనున్న పార్కు చేసిన ఉన్న ప్రైవేటు అంబులెన్స్‌లు, బీసీ కాలనీలో బుల్లెట్‌ను పెట్రోల్‌పై పోసి తగలబెట్టారని సీఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దాడి కేసు, మరో కేసు నమోదు చేసినట్టు చెప్పారు. నిందితుల కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. డీఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు.

ఏలేరు కాల్వలోకి దూసుకుపోయిన వ్యాన్

- డ్రైవర్ మృతి


నాగరాజు మృతదేహం

తుమ్మపాల: మండలంలో శంకరం బొజ్జన్నకొండ వద్ద ఏలేరు కాల్వలోకి వ్యాన్ దూసుకుపోయిన ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. సమాచారం అందించడంతో రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో వాహనాన్ని బయటకు తీశారు. రూరల్ సీఐ అశోక్‌కుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి నుంచి బొజ్జన్న కొండ మీదుగా తుమ్మపాల వెళ్తున్న బొలేరో వ్యాన్ అదుపుతప్పి ఏలేరు కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తుమ్మపాల గ్రామంలోని చినబాబు కాలనీలో నివాసముంటున్న వ్యాన్ డ్రైవర్ తామర్ల నాగరాజు (53) మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇస్రోకు 'వంద'నం


సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: ఇస్రో 100వ ప్రయోగం విజయవంతంపై మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో సంబరాలు చేశారు. శ్రీహరికోటలో ఇస్రో ప్రయోగించిన జీఎస్ఎల్‌వీఎఫ్ 15 రాకెట్ ప్రయోగాన్ని స్మార్ట్ టీవీ ద్వారా విద్యార్థులకు చూపించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు విద్యార్థులు సెల్యూట్ చేశారు. పాఠశాల హెచ్‌ఎం కె.రాము మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే రాకెట్ ప్రయోగాలు, శాస్త్రవేత్తల గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రయోగాన్ని విద్యార్థులకు చూపించామన్నారు. అనంతరం 100వ రాకెట్, ఇస్రో అనే అక్షరాలతో సంబరాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి పాల్గొన్నారు.

లాహిరి లాహిరి లాహిరిలో..

- తెప్పోత్సవంలో హంస వాహనంపై అప్పన్న
- వేణుగోపాలస్వామిగా భక్తులకు దర్శనం

సింహాచలం: పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామివారు వేణుగోపాలస్వామిగా దర్శనమిచ్చాడు. హంస వాహనంపై నౌకావిహారంలో కనువిందు చేశాడు. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో వరాహపుష్కరిణి కిటకిటలాడింది. సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకి తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి అధికారులు, అడవివరం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఊరేగింపుగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. శోభాయమానంగా అలంకరించిన హంసాకృతి నౌకపై స్వామిని కొలువుంచి, తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండపంలో స్వామిని వేంజేపచేసి విష్వక్సేణపూజ, పుణ్యాహవచనం, షోడషోపచార పూజలు, విశేష ఆరాధనలు, పారాయణాలు జరిపారు. ఆ తర్వాత స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి సర్వజన మనోరంజని వాహనంపై గ్రామ తిరువీధిని విశేషంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో త్రినాథరావు, దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేద పండితులు, పారాయణదారులు ఈ ఉత్సవాన్ని నిర్వహించారు.


తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

తొలిసారిగా ఏపీఎస్‌ఆర్‌డీఎఫ్ సేవలు

తెప్పోత్సవానికి అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. వరాహ పుష్కరిని, హంస వాహనాన్ని సుందరంగా అలంకరించారు. విద్యుద్దీపాలంకరణ చేశారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలిసారిగా ఏపీఎస్‌ఆర్‌డీఎఫ్ బృందం భద్రతా చర్యలకు వచ్చింది. రెండు బోట్లు, 15 మంది సిబ్బంది తెప్పోత్సవానికి తరలి వచ్చారు.

ఛిద్రమైన కూలీల బతుకులు

- వరి నూర్పు యంత్రం బోల్తా పడి ఇద్దరు కూలీల మృతి
- మృతులు ఒమ్మలి గ్రామానికి చెందిన వారు


జొన్నపల్లి గణేష్ (ఫైల్)


జొన్నపల్లి నాయుడు (ఫైల్)

చోడవరం/మాడుగుల రూరల్: రెక్కాడితే కానీ డొక్కాడనీ జీవితాలు వారివి. ఏరోజుకారోజు సంపాదించుకుని జీవనం సాగిస్తున్న పేదజీవులను రోడ్డు ప్రమాదంలో మృత్యువు కబళించింది. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న వారిని కోల్పోవడంతో ఆ కుటుంబాలు వీధినపడ్డాయి. పొట్టకూటికోసం వరి నూర్పు యంత్రంతో పనిచేస్తున్న ఇద్దరు కూలీలు అదే యంత్రం కింద పడి మృతి చెందడం అందరినీ కలిచివేసింది. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించిన వివరాలు.. మండల కేంద్రం రావికమతంలో నాలుగు కూడలి జంక్షన్ సమీపంలో ఒమ్మలి రోడ్డు మలుపు వద్ద మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మాడుగుల మండలం ఒమ్మలి గ్రామానికి చెందిన జొన్నపల్లి గణేష్, జొన్నపల్లి నాయుడు, జొన్నపల్లి రామశివ సమీప బంధువులు. వీరు రావిలి నవీన్‌కుమార్, తమర దుర్గాప్రసాద్‌తో కలిసి నూర్పు యంత్రంతో ధాన్యం నూర్పు పని చేస్తుంటారు. ట్రాక్టర్‌కు వరి నూర్పుయంత్రాన్ని అనుసంధానంచేసుకొని పనికి వినియోగిస్తున్నారు. ఎప్పటిలాగే మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి వరి నూర్పు చేసేందుకు యంత్రాన్ని తీసుకొని ఈనెల 24న వెళ్లారు. అక్కడ నాలుగు రోజుల పాటు పరిసర ప్రాంతాల్లో వరి నూర్పులు చేసి ఈనెల 28వ తేదీ మంగళవారం రాత్రి వారు యంత్రాన్ని తీసుకు నిబయలుదేరారు. వీరిలో జొన్నపల్లి రామశివ ట్రాక్టర్ నడుపుతుండగా రావికమతంలో ఒమ్మలి వెళ్లే రోడ్డు జంక్షన్ దగ్గర నూర్పుయంత్రంతో వస్తున్న ట్రాక్టర్‌ను మలుపు తిప్పే క్రమంలో నూర్పుయంత్రం ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఆ యంత్రంపై కూర్చొని ఉన్న జొన్నపల్లి గణేష్, జొన్నపల్లి నాయుడు యంత్రం కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. నవీన్‌కుమార్, దుర్గాప్రసాద్ స్వల్పగాయాలతోబయటపడ్డారు. మంగళవారం రాత్రి 10.30 సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రావికమతం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించా రు. అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగింద ని పోలీసులుభావిస్తున్నారు.కేసుదర్యాప్తుచేస్తున్నట్టు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, రావికమతం ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.పొట్టకూటికోసం కూలిపనికి వెళ్లిన ఇంటి యజమానులు మృతిచెందడంతో తమకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు. మృతుడు గణేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలిద్దరూ స్థానిక ఎంపీపీ పాఠశాలల్లో చదువుతున్నారు. జొన్నపల్లి నాయుడుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహమైంది.

ఎల్‌సీడీసీతో 'కుష్టు' ముందస్తు గుర్తింపు


లెప్రసీ హౌస్ టు హౌస్ సర్వేను పరిశీలిస్తున్న సెంట్రల్ లెప్రసీ డైరెక్టర్ డాక్టర్ విజయకుమారన్, డాక్టర్ భాగ్యజ్యోతి తదితరులు

సబ్బవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) కార్యక్రమాన్ని సెంట్రల్ లెప్రసీ డైరెక్టర్ డాక్టర్ విజయకుమారన్, డాక్టర్ భాగ్యజ్యోతి బుధవారం పర్యవేక్షించారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 2 వరకు 14 రోజుల పాటు ఈ ఎల్‌సీడీసీ సర్వే నిర్వహించనున్నారు. మండలంలోని పలు గ్రామాలల్లో చేస్తున్న ఇంటింటి సర్వే తీరును పరిశీలించారు. స్థానిక ఆశా కార్యకర్తలు, వలంటీర్ల పని తీరును పర్యవేక్షించారు. పీహెచ్‌సీకి సంబంధించిన లెప్రసీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన లెప్రసీ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్, అనకాపల్లి జిల్లా లెప్రసీ అధికారి ఎంపీఎస్‌కే బాలాజీ, సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ఆర్ చక్రవర్తి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణతో పాటు గురుకుల పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఊడేరులో నేడు ప్రత్యేక ఆధార్ క్యాంపు

అనకాపల్లి: మండలంలో ఊడేరు సచివాలయంలో గురువారం ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఆధార్ కార్డులు, ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఆధార్ క్యాంపు కొనసాగుతుందన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ సమీపంలో కొణతాల లక్ష్మి వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు భాస్కర్ బుధవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. అనంతరం జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారి పూడిమడక జంక్షన్ బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని షేక్ సుభాన్(60) అనే వ్యక్తి బుధవారం అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు ఆగి ప్రయాణికులను ఎక్కించుకుంటుండగా ముందు నుంచి షేక్ సుభాన్ వెళ్లారు. డ్రైవర్ గమనించక బస్సు నడపడంతో ఆయన్ను ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడు యాచకుడిగా భావిస్తున్నారు.

'బ్రాండిక్స్‌లో పని వేళల పెంపును విరమించుకోవాలి'



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం: బ్రాండిక్స్‌లో పని చేసే కార్మికుల పనివేళల పెంపు ప్రతిపాదనను యాజమాన్యం వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కార్యదర్శి కె.సోమునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక మీడియాతో మాట్లాడారు. రోజుకు 8 గంటల పాటు షిఫ్టుల వారీగా పని చేసే మహిళా కార్మికులు వారి ఇంటి వద్ద బయలు దేరి, తిరిగి ఇంటికి వెళ్లే సమయానికి పని వేళలతో పాటు అదనంగా 6, 7 గంటలు పడుతుందన్నారు. దీని వల్ల తీవ్రంగా అలసిపోతున్న మహిళా కార్మికులకు పెంచిన అర గంట మరింత ఇబ్బందికి గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పని వేళల పెంపు విషయంలో యాజమాన్యం పునరాలోచించి తగిన నిర్ణయం తీసుకోవడంతో పాటు, కార్మికుల ఆరోగ్య భద్రతపై శ్రద్ధ చూపాలని వారు కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 7,023 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,570
మొదటి రకం	3,500	4.190
రెండో రకం	3,000	3,800
మూడో రకం	2,750	3,040

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	:సత్యనారాయణ స్క్రీన్-2
గేమ్ ఛేంజ్	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
హంగ్ కాంగ్ వారియర్స్	:వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	:శ్రీసత్య
ఐడెంటీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 97 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు , బీ పాజిటివ్-33 యూనిట్లు, ఓ పాజిటివ్-47 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 414 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.



కొత్తగా నిర్మించిన స్టేషన్ భవనం



శిథిల భవనంలో నడుస్తున్న నరసింగబిల్లి రైల్వే స్టేషన్

పట్టాలెక్కిన అభివృద్ధి

- నరసింగబిల్లి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ
- పెరిగిన గూడ్స్ రైళ్ల రాకపోకలు
- అదనపు ట్రాక్ ఏర్పాటు



నరసింగబిల్లి రైల్వే స్టేషన్ పాత ప్లాట్ ఫారం



అదనపు ట్రాక్ ఏర్పాటుకు చదును చేసిన ప్రాంతం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగా స్టేషన్ భవనం, అదనపు ట్రాక్‌ల నిర్మాణం చేపట్టారు. సుమారు ఐదు దశాబ్దాల క్రితం ఏర్పడిన నరసింగబిల్లి రైల్వే స్టేషన్ ఐదేళ్ల క్రితం వరకు రైళ్ల క్రాసింగ్ వరకే పరిమితమయ్యేది. ఇక్కడ పాసింజర్ రైళ్లు మాత్రమే ఆగేవి. చుట్టు పక్కల ఉన్న నరసింగబిల్లి, సోమవరం, గణపర్తి, చూచుకొండ, మెలిపాక తదితర గ్రామాల నుంచి నిత్యం వ్యాపారులు, విద్యార్థులు, కూలీలు, ప్రయాణికులు స్టేషన్ నుంచి ప్రయాణిస్తుంటారు. ఒక వైపు మాత్రమే ప్లాట్ ఫారం ఉండేది. ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రమే అయినా స్టేషన్ చుట్టు పక్కల పరిశ్రమలు రావడంతో గూడ్స్ రైళ్ల వినియోగం పెరగడం ద్వారా ఆదాయం వస్తోంది. దీంతో రైళ్ల రద్దీ పెరగడంతో స్టేషన్ అభివృద్ధిపై ప్రభుత్వం, రైల్వే శాఖ దృష్టి సారించింది. ఐదేళ్ల క్రితం స్టేషన్ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా రెండో వైపు ప్లాట్ ఫారం నిర్మించారు. స్టేషన్ భవన నిర్మాణం పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో కరోనా రావడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. సుమారు ఆరు నెలల క్రితం మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి. స్టేషన్ భవనాన్ని అధునాతన కంప్యూటర్ సిగ్నల్ వ్యవస్థతో ఏర్పాటు చేసే విధంగా నిర్మించారు. తుది మెరుగులు దిద్దుకుంటోంది. విశాఖ-విజయవాడ మార్గంలో ఉన్న రైళ్ల రాకపోకల ప్రధాన ట్రాక్‌లతో పాటు రెండు వైపులా చెరో లూప్‌లైన్ ట్రాక్‌లు ప్రస్తుతం ఉన్నాయి. ఇవి స్టేషన్‌లో రద్దీ దృష్ట్యా అవసరాలను తీర్చలేకపోతున్నాయి. ఐదేళ్ల క్రితం రామ్‌కో సిమెంట్ పరిశ్రమ, విమల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ లాజిస్టిక్ పరిశ్రమలు స్టేషన్ సమీపంలో నెలకొల్పారు. దీంతో వాటిలోని ఉత్పత్తులు, సరకులను ఇతర ప్రాంతాలకు గూడ్స్ వేగన్‌ల ద్వారా రవాణా చేయడానికి ఆయా పరిశ్రమల నిర్వాహకులు ప్రత్యేక ట్రాక్‌ను వేర్వేరుగా ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా నెలకు సుమారు 15 నుంచి 20 వరకు గూడ్స్ రైళ్ల ద్వారా సరకుల రవాణా జరుగుతోంది. ఈ రైళ్ల రాకపోకలకు ప్రధాన కేంద్రంగా నరసింగబిల్లి స్టేషన్ ఉంది. అక్కడి నుంచే లూప్ లైన్ ద్వారా ఆయా పరిశ్రమలకు రాకపోకలు సాగిస్తున్నాయి. చుట్టు పక్కల కొత్తగా సిమెంట్ పరిశ్రమలు ఏర్పడటం, మరో కొన్ని నెలకొల్పనుండడంతో గూడ్స్ రైళ్ల వినియోగానికి డిమాండ్ ఏర్పడనుంది. ఆయా పరిశ్రమల నుంచి డిమాండ్ ఉన్న దృష్ట్యా కొత్తగా అదనపు రైల్వే ట్రాక్‌ను స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రైల్వే కమ్ములు, స్లీపర్లు, నల్ల పిక్క తీసుకు వచ్చి చదును చేసే ప్రక్రియ చేపట్టారు. స్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తి కావడానికి మరో ఆరు నెలలు సమయం పడుతుందని అధికారిక సమాచారం. ఇవి పూర్తయితే స్టేషన్ సకల సౌకర్యాలతో అందుబాటులోకి రానుంది. ఈ ప్రాంత ప్రజలకు ఒక పక్క ప్రయాణానికి, మరో వైపు సరకుల రవాణాకు ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

653 పశువులకు వైద్య పరీక్షలు



ఉగ్గినపాలెంలో మందులు అందజేస్తున్న సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు



జమాదులపాలెంలో నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్న కశింకోట పశు వైద్యాధికారి

కశింకోట: మండలంలోని రెండు గ్రామాల్లో బుధవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించి 653 పశువులకు వైద్య సేవలందించారు. ఉగ్గినపాలెం శిబిరంలో కన్నూరుపాలెం పశు వైద్యాధికారి దయానా 8 పశువులకు గర్భ కోశ పరీక్షలు, 53 పశువులు, 500 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. మినరల్ మిక్చర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, కూటమి నాయకుడు కలగా సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జమాదులపాలెంలో నిర్వహించిన శిబిరంలో 32 పశువులకు కశింకోట పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జ్ గర్భ కోశ పరీక్షలు నిర్వహించి, 60 పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. మినరల్ మిక్చర్ ప్యాకెట్లను రైతులకు ఈ సందర్భంగా అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు గూడువు లక్ష్మి, పాల సంఘం అధ్యక్షుడు పరవాడ రాము, మాజీ అధ్యక్షుడు బొట్టా రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర లెప్రసీ బృందం సర్వే



తుమ్మపాల పంచాయతీ కొత్తపేట వీధిలో సర్వే చేస్తున్న కేంద్ర లెప్రసీ వైద్యబృందం

కశింకోట/అనకాపల్లి: కేంద్ర లెప్రసీ బృందం బుధవారం కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, తుమ్మపాల పీహెచ్‌సీ పరిధి తుమ్మపాల పంచాయతీ కొత్తపేట వీధిని సందర్శించింది. ఎల్‌సీడీసీ (లెప్రసీ కేర్ డిటెక్షన్ క్యాంపెయిన్)లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో బృందం లెప్రసీ డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమారన్, డాక్టర్ భాగ్యజ్యోతి, రాష్ట్ర లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ ఎంఎస్‌వికె బాలాజీ ఉన్నారు. వీరు కశింకోట పీహెచ్‌సీ సందర్శించి రికార్డులను పరిశీలించారు. వీరికి పీహెచ్‌సీ వైద్యులు తిరుపతిరావు, యశోదలు లెప్రసీ సర్వేపై వివరాలు తెలియజేశారు. అనంతరం బృందం సభ్యులు వెళ్లి స్థానిక దాడి వారి వీధిలో లెప్రసీ సర్వే నిర్వహణ గురించి ప్రజలను ప్రశ్నించి ఆరా తీశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. ఎవరికైనా శరీరంపై మచ్చలుంటే చర్మ వ్యాధి నిపుణులను సంప్రదించి వైద్య సేవలు పొందాలని బృందం ప్రతినిధి విజయ్‌కుమారన్ సూచించారు. తుమ్మపాల పీహెచ్‌సీ పరిధి తుమ్మపాల పంచాయతీ కొత్తపేట వీధిలో వీరు ఇంటింటి సర్వే చేశారు.

యలమంచిలి అత్యాచార ఘటనపై నిరసన



కశింకోటలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న మహిళలు

కశింకోట: యలమంచిలిలో హాకీ క్రీడాకారిణి, మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కోచ్‌ను తక్షణమే కఠినంగా శిక్షించాలని కోరుతూ కశింకోటలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి మాట్లాడుతూ యలమంచిలి మండలానికి చెందిన 13 ఏళ్ల బాలిక హాకీ కోచింగ్‌కు వెళ్లగా కోచ్ అత్యాచారానికి పాల్పడటం దారుణమన్నారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న మానవ మృగాలను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా కఠినంగా శిక్షించాలన్నారు. ఇటువంటి దారుణాలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలు, అశ్లీల చిత్రాలు ఇటువంటి దారుణ సంఘటనలు జరగడానికి కారణమవుతున్నాయని, వాటిని నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు ఆర్.శేషు, ఎం.తారక, ఎం.ప్రభ, షేక్ లక్ష్మి, కె.శాంతి, కె.లక్ష్మి, నూకరత్నం, కోటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వల్లభేశ్వరస్వామి తీర్థం

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెం గ్రామంలో వల్లభేశ్వరస్వామి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. తీరం పర్వతంపై కొలువుదీరిన స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచితీరంలో సముద్ర స్నానాలు ఆచరించిన భక్తులు క్యూలో నిల్చుని స్వామికి ఎరుపు జెండాను సమర్పించి దర్శించుకున్నారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిలాడింది.

విద్యుత్ రంగ పరిరక్షణకు ఉద్యమాలు



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యం

అనకాపల్లి: విద్యుత్ రంగ పరిరక్షణే లక్ష్యంగా ఉద్యమాలు చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యం అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన యూనియన్ రీజనల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ రంగాన్ని ప్రభుత్వాలు కుదేలు చేస్తున్నాయని, కాపాడుకోవలసి బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యుత్‌శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, పర్మినెంట్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సాధించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల వల్ల విద్యుత్‌సంస్థలు నష్టాల్లో కూరుకుపోతున్నాయని చెప్పారు. ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రీజినల్ అధ్యక్షుడు ప్రేమ చంద్రశేఖర్, నాయకులు జె.శ్రీను, నాగ అప్పారావు, కె.రవికుమార్, దార అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మేలుజాతి పశువుల పెంపకం మేలు

మునగపాక: మేలుజాతి పశువుల ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చని తిమ్మరాజుపేట పశువైద్యాధికారి జె.పద్మజ అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో బుధవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించి రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా పాల దిగుబడులు పెంచుకోవాలంటే పశువుల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సీజన్‌లో ఎటువంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమరశెట్టి శ్రీనివాసరావు, శరగడం జగన్నాథరావు, బీవీ కృష్ణారావు, బీవీ రమణ, సూరిశెట్టి రాము, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో సాగు ఖర్చు తక్కువ



నాట్లు పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రమణమూర్తి

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో జరుగుతున్న వరినాట్లను బుధవారం అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ కేవీ రమణమూర్తి పరిశీలించారు. డ్రమ్‌సీడర్ ద్వారా నాట్లు వేసే పద్ధతిని ఆయన పరిశీలించారు. డ్రమ్‌సీడర్ ద్వారా నాట్లు వేసుకోవడం ద్వారా ఖర్చు తగ్గుతుందన్నారు. వరిసాగులో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనకాపల్లి వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ రామారావు, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి



కూరగాయలు మార్కెట్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. వచ్చే నెల 1 నుంచి 3 వరకూ నెల్లూరులో జరిగే పార్టీ 27వ రాష్ట మహాసభలను పురస్కరించుకుని స్థానిక నెహ్రూచౌక్ కూరగాయలు మార్కెట్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం స్టీల్‌ప్లాంట్ వద్ద జీపు జాతా కార్యక్రమం ప్రారంభమై నెల్లూరు వరకూ కొనసాగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై మోదీ ప్రభుత్వం స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా ప్యాకేజీ కింద రూ.11,400 కోట్లు ఇచ్చామని చెప్పి, అదానీకి ప్లాంట్‌ను అప్పగించే విధంగా చర్యలు చేపడుతుందన్నారు. విలీనానికి సెయిల్ అధికారులు ఒప్పుకోలేదని కాకమ్మ కథలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా నాయకులు జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు, వి.వి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, అల్లు రాజు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: విద్యుత్ శాఖ డీ-1 సెక్షన్ పరిధిలో నిర్వహణ పనులు, కొత్త లైన్ల ఏర్పాటు నిమిత్తం టౌన్-1, 2, 11కేవీ ఉడ్‌పేట ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. టౌన్-1 పరిధిలో గుండాల వీధి, లక్ష్మీదేవిపేట, ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ రహదారి, పాతకోర్టు వీధి, గాంధీనగరం, మిరియాల కాలనీ, అంజయ్య కాలనీ, విజయరామరాజుపేట, ఏఎంసీ కాలనీ, 11 కేవీ ఉడ్‌పేట ఫీడర్ పరిధిలో నర్సింగరావుపేట, చవితినివీధి, దుర్గాలాడ్జీ వీధి, నర్సింగరావుపేట, కోట్నివీధి, టౌన్-2 పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, శారదా కాలనీ, న్యూకాలనీ, రాజా థియేటర్ మెయిన్ రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం రహదారిలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

33/11కేవీ కశింకోట సబ్‌స్టేషన్‌లో రేపు మరమ్మతులు

కశింకోట సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం మండలంలో కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో శుక్రవారం అనకాపల్లి మండలంలో సత్యనారాయణపురం, సంపతిపురం, వేటజంగాలపాలెం, కూండ్రం, కుంచంగి, రొంగలివానిపాలెం, పిసినికాడ గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గృహ అవసరాలు, వ్యవసాయ రైతులు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మైనింగ్‌కు ప్రత్యామ్నాయ రహదారి

- ఎట్టకేలకు కదిలిన యంత్రాంగం
- చింతనిప్పల అగ్రహారం, రేబాక గ్రామాల మీదుగా కొత్త రోడ్డు



రేబాక రెవెన్యూ సర్వే నంబర్ 232లో గెడ్డను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తుమ్మపాల: చింతనిప్పుల అగ్రహారం, మార్టూరు, మాకవరం గ్రామాల రోడ్డు సమస్యపై అధికార యంత్రాంగం అడుగు ముందుకేసింది. చింతనిప్పుల అగ్రహారం గ్రామానికి ప్రత్యామ్నాయంగా మైనింగ్ రోడ్డును నిర్మించేందుకు అన్ని శాఖలు సమాయత్తమయ్యాయి. ఈ సమస్యపై 'పచ్చని గ్రామాల మధ్య కూటమి చిచ్చు', 'బతుకులు బూడిత పాలు'వంటి శీర్షికలతో ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనాలకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం అన్ని శాఖల అధికారులతో కలిసి కొణతాల మైనింగ్ రోడ్డు నిర్మాణం సాధ్యాసాధ్యాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చింతనిప్పుల అగ్రహారం ఎస్సీ కాలనీ ఆనుకుని సర్వే నంబర్ 72, 95, రేబాక రెవెన్యూ సర్వే నంబర్ 232, 243, 244.1, ప్రభుత్వ భూముల స్థితిగతులను చూశా రు. నేరుగా జాతీయ రహదారికి అనుసంధానం చేయడంపై అధికారులతో చర్చించారు. సాగునీరు, కొండ గెడ్డల నీటి ప్రవాహానికి భారీ కల్వర్టులు నిర్మాణానికి ప్రణాళిక చేయాలన్నారు. సర్వే నెం. 243 పొత్రుని చెరువు జిరాయితీగా ఉన్నందున యాజమానులతో చర్చించాలన్నారు. అంతకుముందు మార్టూరు గ్రామంలో క్వారీలు, టిప్పర్ల యాజమానుల సమస్యలపై తెలుసుకున్నారు. ఎట్టకేలకు మైనింగ్ కోసం ప్రత్యేక రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో పలు క్వారీల యాజమానులు, టిప్పర్ల యాజమానులు ఆనందం వ్యక్తం చేశారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



సూపరింటెండెంట్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్

అనకాపల్లి: పేద రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించి అందరి మన్ననలు పొందాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావును బుధవారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత ఎన్టీఆర్ వైద్యాలయానికి రోగుల సంఖ్య పెరిగిందని, వైద్య సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాత్రి సమయంలో అత్యవసర విభాగంలో మరో వైద్యున్ని నియమించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు విల్లూరి పైడారావు, బొడ్డేడ అప్పారావు, బొడ్డు సోమరాజు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరావు, ముగడా అప్పారావు, భరిణికాన సూరిబాబు, చదరం వెంకటరావు, సత్యసాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాకే బల్క్ డ్రగ్ పార్క్ పనులు ప్రారంభించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

- తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

నక్కపల్లి: ఏపీఐఐసీకి భూములిచ్చిన రైతులు, నిర్వాసితుల సమస్యలు పూర్తిగా పరిష్కరించిన తర్వాతే బల్క్ డ్రగ్ పార్క్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పలువురు నిర్వాసితులు, రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లాకార్యవర్గ సభ్యులు అప్పలరాజు, రైతునాయకులు గింజాల వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ రాజయ్యపేట, చందనాడ, డీఎల్ పురం, బుచ్చిరాజుపేట,వేంపాడు తదితర గ్రామాల్లో డీఫారం, ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న రైతులకు సంబంధించి జీడిమామిడి తోటలకు నష్ట పరిహారం చెల్లించలేదని తెలిపారు. నబ్బువరం మండలంలో పెట్రోయూనివర్సిటీ ఏర్పాటు సమయంలో, నక్కపల్లి మండలం బంగారయ్యపేటలో క్వారంటైల్ ల్యాబ్‌లకోసం సేకరించిన భూములకు సంబంధించి సాగుదార్లకు, డీఫారం రైతులకు తోటలకు నష్టపరిహారం చెల్లించారని, ఇక్కడ కూడా ఆదేవిధంగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయకుండా బల్క్‌డ్రగ్‌పార్క్ పనులు ప్రారంభించారని ఇది సమంజసం కాదని తెలిపారు.అనంతరం తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతి పత్రం ఇచ్చారు. ఈఆందోళనలో శంకరరావు,కోటేశ్వరరావు, ఎం. రాజేష్,మహేష్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.